VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 08 శుక్రవారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 110

అక్రమంగా పిజి మెడికల్

## సీట్ విక్రయం

మాజీమంత్రి మల్లారెడ్డికి ఇడి నోటీసులు




PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# మూసీ పునరుజ్జీవం.. చేసి తీరుతాం



**ఎవరికీ నష్టం కలగనీయం**

**ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం**

**ఫార్ములా-ఈ రేస్‌పై నిబంధనల ప్రకారమే ఏసీబీ చర్యలు**

**మూసీ పునరుజ్జీవాన్ని నూటికి నూరు శాతం చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.**

హైదరాబాద్:మూసీ పునరుజ్జీవాన్ని నూటికి నూరు శాతం చేసి తీరుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అయితే ఎవరికీ ఎలాంటి నష్టం వాటిల్లకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా శుక్రవారం పాదయాత్ర చేయనున్న సీఎం గురువారం 'ఈనాడు'తో మాట్లాడారు. "హైదరాబాద్ నగరం ప్రపంచంలోని ఇతర నగరాలతో పోటీపడాలంటే మూసీ పునరుజ్జీవం చేయకతప్పదు. ప్రతి రెండు, మూడేళ్లకోసారి భారీ వర్షం వస్తే హైదరాబాద్ ఏమవుతోందో చూస్తున్నాం. ఇటీవల పలు దేశాలు వర్షానికి ఎలా అతలాకుతలం అయ్యాయో చూశాం. కేరళలో ఏం జరిగిందో కూడా చూశాం. ఇలా అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని పునరుజ్జీవం గురించి ప్రయత్నం మొదలుపెట్టాం. మూసీ పునరుజ్జీవాన్ని ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో చేపడతాం. ప్రభుత్వానికి ఆదాయం రావడం తప్ప ఖర్చు ఏమీ ఉండదు. మూసీని పునరుజ్జీవం చేయడమంటే మురుగునీటిని పూర్తిగా శుద్ధి చేయడం, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చూడటం, రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, 55 కి.మీ. దూరం వరకు నదికి ఇరువైపులా ఆహ్లాదకర వాతావరణం కల్పించడం, కొత్త కొత్త కేంద్రాలు ఏర్పడటం.. ఇలా అనేక అంశాలు ఇందులో ఇమిడి ఉన్నాయి.అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా..హైడ్రా తన పని తాను చేసుకుపోతోంది. నీటి వనరులను కాపాడటం హైదరాబాద్‌కు ఎంతో ముఖ్యం. సియోల్ సహా అనేక నగరాలకు నీరు, పచ్చదనం, శుభ్రత అందాన్ని తెచ్చిపెట్టాయి. హైదరాబాద్ లాంటి నగరాలు ప్రపంచంలో అనేకచోట్ల అద్భుతంగా మారినపుడు మనమెందుకు చేసుకోలేం? మూసీ పునరుజ్జీవంతో ఏ ఒక్కరికీ నష్టం కలగనీయం. ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటాం. ఇంటింటి సర్వే చేసి ప్రతి ఒక్కరి వివరాలు సేకరించాం. నదీ గర్భంలో 2,160 కుటుంబాలు, బఫర్ జోన్‌లో 8వేల కుటుంబాలు ఉన్నాయి. ప్రభుత్వం వారితో చర్చించి అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలానే చేస్తుంది. మొదటి దశలో బాపూఘాట్ ఎగువ భాగంలో పునరుజ్జీవం చేపడతాం. గోదావరి నీటిని హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ ద్వారా మూసీకి మళ్లిస్తాం. అంతిమ లక్ష్యం మూసీలో శుభ్రమైన నీరు ఉండటం, హైదరాబాద్ వాసులకు ఓ కొత్త నగరం అనుభూతి కల్పించడం. ఆ తర్వాత జరిగే అభివృద్ధిలో దీని పాత్రను ఎవరూ కాదనలేరు.

ఆర్థికశాఖ అనుమతి లేకుండానే ఖర్చుహెచ్ఎండీఏ బోర్డుకు ఛైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్-ఛైర్మన్‌గా మంత్రితో పాటు డైరెక్టర్లు ఉంటారు. నిధులు చెల్లించాలంటే ఈ బోర్డు ఆమోదం అవసరం. ఇక్కడ అలాంటిదేమీ జరగలేదు. కొంతమొత్తం దాటి ఖర్చు చేయాలంటే ఆర్థిక శాఖ అనుమతి కావాలి. మంత్రివర్గం వద్దకు వెళ్లాలి. కానీ, ఇవేం లేవు. ప్రభుత్వంలో రూపాయి ఖర్చు పెట్టాలన్నా ఓ ప్రొసీజర్ ఉంటుంది కదా! ఇక్కడ ఏ ప్రొసీజరూ లేకుండా ఖర్చు పెట్టారు. ఇందులో జరిగిన లోపాలను గుర్తించి ఏసీబీకి పురపాలక శాఖ ఫిర్యాదు చేసింది. వాళ్లు ప్రొసీజర్ ప్రకారం ఏం చేయాలో అది చేస్తారు. ఎవరి నుంచి ఎలాంటి సమాచారం కావాలో, ఎవరి నుంచి ఎటువంటి అనుమతులు కావాలో అడిగి తీసుకుంటారు.

ప్రజాస్వామ్యయుతంగా పాలనరైతు రుణమాఫీ సహా అనేక హామీలను అమలు చేశాం. హాస్టల్ విద్యార్థుల భోజనానికి అయ్యే ఖర్చు, కాస్మెటిక్ ఛార్జీలు పెంచి ఎంతకాలం అయింది? మేమే కదా ఇప్పుడు పెంచాం. దీనివల్ల ఏడున్నర లక్షల మందికి ప్రయోజనం కలిగింది. భారాస హయాంలో పదేళ్లు చీకటి పాలన ఉండేది. ఎవరైనా మాట్లాడే పరిస్థితి ఉండేదా? ఇప్పుడు చూడండి ఎవరైనా మాట్లాడొచ్చు. నిరసనలు చేయవచ్చు.

# జైలుకు వెళ్లడానికి నేను సిద్ధమే



హైదరాబాద్: జైలుకు వెళ్లేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదని బిఆర్ఎస్ నేత కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నా మీద ఎందుకు కేసులు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? అని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.ఫార్ములా-ఈ రేస్ విషయంలో మీడియాకు చెప్పిందే.. అక్కడ చెబుతా. గవర్నమెంట్‌గా నిర్ణయం తీసుకున్నానని చెబుతాను. హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి దృష్ట్యా నిర్ణయం తీసుకున్నాను. నా మీద కేసులు ఎందుకు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చినందుకా..? ప్రపంచపటంలో హైదరాబాద్‌ను నిలబెట్టినందుకా..? బెంగళూరును దాటి హైదరాబాద్‌లో ఐటీ ఎగుమతులు పెంచినందుకా..? పారిపోతాయన్న కంపెనీలను కాపాడినందుకా..? దిగ్గజ కంపెనీలకు డ్రీమ్ డెస్టినేషన్‌గా మార్చినందుకా..? కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినందుకా..?

మిగతా 2లో

**యోగా చేసి ట్రిమ్ముగా తయారై వస్తా**

**నీ ఉడత బెదిరింపులకు భయపడేది లేదు**

**ఈ రేసింగ్‌తో హైదరాబాద్ ఇమేజ్ పెంచా**

**మెఘా కంపెనీపై కేసు పెట్టే దమ్ముందా**

**మీడియా సమావేశంలో కెటిఆర్ హాట్ కామెంట్స్**

# 11 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

- పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లుగా పరిస్థితి
- ధాన్యం కొనే దిక్కులేక రైతుల అవస్థలు
- దళారుతలో కుమ్మక్కయిన మిల్లర్లు
- సంస్థాగతంగా బిజెపి బలోపేతం చేయాలి
- ప్రజల సమస్యలపై ఎక్కడిక్కడ పోరాటాలు
- పార్టీ కార్యశాలలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




# ఉద్యోగ నియామకాల ఎంపిక ప్రక్రియ



**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చలేమని కోర్టు పేర్కొంది. పోస్టుల ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత నియమాలను మధ్యలో మార్చలేమని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ కేసు రాజస్థాన్ హైకోర్టులో ఓ ప్రభుత్వ పోస్టు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పుల చెప్పింది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ హ్రిషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. 2008లో కె.మంజుశ్రీ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బెంచి సమర్థించింది. ఆ కేసు తీర్పు సరైనదని.. దానిని తప్పు అని చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. 'ప్రభుత్వాలు నియామక పక్రియకు ముందే నిబంధనలు సిద్ధం చేసి ఆ తర్వాతే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించాలి.

# తెలంగాణలో పలువురు డీఎస్పీల బదిలీ

**హైదరాబాద్ :** తెలంగాణలో పలువురు డీఎస్పీ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ఇవాళ (గురువారం) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న జీ మహేశ్ బాబుని కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా ఉన్న బీ.రామానుజంను కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ఉన్న ఏ.కరుణాకర్‌ను అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు.

అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా ఉన్న పీ.సదయ్యను బదిలీపై హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని డీజీపీ కోరారు. ప్రస్తుతం వనపర్తి డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న కే.క్రిష్ణ కిశోర్‌ను తొర్రూర్ (మహబుబాబాద్) ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. ఇక తొర్రూర్ ఎస్‌డీపీవోగా ఉన్న వీ సురేశ్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నిర్మల్ డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న పీ.రవీందర్ రెడ్డిని ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా బదిలీ చేశారు. ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా ఉన్న డీ.ప్రసన్న కుమార్‌ను మెదక్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు డీజీపీ ఉత్వర్వులు జారీ చేశారు. కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో తక్షణమే రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు.



# జైలుకు వెళ్లడానికి నేను సిద్ధమే



**హైదరాబాద్:** జైలుకు వెళ్లేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదని బిఆర్ఎస్ నేత కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నా మీద ఎందుకు కేసులు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? అని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫార్ములా–ఈ రేస్ విషయంలో మీడియాకు చెప్పిందే.. అక్కడ చెబుతా. గవర్నమెంట్‌గా నిర్ణయం తీసుకున్నానని చెబుతాను. హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి దృష్ట్యా నిర్ణయం తీసుకున్నాను. నా మీద కేసులు ఎందుకు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చినందుకా..? ప్రపంచపటంలో హైదరాబాద్‌ను నిలబెట్టినందుకా..? బెంగళూరును దాటి హైదరాబాద్‌లో ఐటీ ఎగుమతులు పెంచినందుకా..? పారిపోతాయన్న కంపెనీలను కాపాడినందుకా..? దిగ్గజ కంపెనీలకు డ్రీమ్ డెస్టినేషన్‌గా మార్చినందుకా..? కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినందుకా..? అని సూటిగా ప్రశ్నించారు. అటెన్షన్ డైవర్షన్ గేమ్‌లతో రేవంత్ రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేడు. నువ్వు ఎన్ని వేషాలు వేసినా.. మేం నిన్ను విడిచిపెట్టం. ఆరు గ్యారెంటీలను వదిలిపెట్టం. అప్పుడప్పుడు నువ్వు గోకినట్టు చేస్తే మేం కూడా వివరణ ఇస్తాం ఎందుకంటే ప్రజలకు వాస్తవాలు తెలియాలి. ఇన్ని చెప్పినా కూడా కేసు పెడుతాం అంటే నీ ఇష్టమున్న కేసు పెట్టుకో అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కేటీఆర్ టార్గెట్ అని పేపర్లలో రాస్తున్నారు. ఆరు గ్యారెంటీల అమలు, వడ్ల కొనుగోలు, రైతుబంధు, దళితబంధు, స్కూటీలు ఇచ్చుడు, తులం బంగారం ఇచ్చుడు, గురుకులాలు బాగు చేసే విషయంలో టార్గెట్ ఉండాలి.. టార్గెట్ కేటీఆర్ కాదు. వేస్తే వేసుకో.. నాకేం ఫరక్ పడేది లేదు. ఓ రెండు, మూడు నెలలు జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతా అంటే నాకేం అభ్యంతరం లేదు. మంచిగా పోతా.. యోగా గిగా చేసుకోని ట్రిమ్‌గా వస్తా.. పాదయాత్ర ఎక్కుతా. నేను భయపడేటోని కాదు. ఈ ఉడుత ఊపులకు భయపడను. గాసిప్స్ పక్కకు పెట్టి.. గవర్నమెంట్ మీద దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. ఇకపోతే మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదకు ఏసీబీని పంపే దమ్ముందా..? అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. నీవు మొగోనివే అయితే మెగా కృష్ణారెడ్డి కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నన్ను ఏసీబీ విచారిస్తుందట.. ఏసీబీ ఫుల్ ఫామ్ తెలుసా రేవంత్ రెడ్డికి.. తెలుసనుకో.. బ్యాగులతో తిరిగినోడికి ఎందుకు తెల్వదు. ఏసీబీ అంటే యాంటీ కరప్షన్ బ్యూరో. ఏసీబీని కరప్షన్‌కు వ్యతిరేకంగా వాడాలి. ఇందులో కరప్షన్ ఏడుంది.. కాకరకాయ ఏడుంది. నేను అడుగుతున్నా చెప్పు. ఫార్ములా–ఈ రేస్ హైదరాబాద్‌లో ఉండాలని చెప్పి హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు పంపిన మాట వాస్తవం. దాంట్ల నేను ఏమైనా దాచుకుంటినా..? నాకు ఏమైనా వచ్చాయ..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ రేస్ రద్దుతో హైదరాబాద్‌కు నష్టం కలిగించినా రేవంత్ రెడ్డి మీద కేసు పెట్టాలి. హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీశావు. రేవంత్ రెడ్డిది తెలివితక్కువ నిర్ణయం. ఆగస్టు 25న నరికిండు రేవంత్ రెడ్డి.. 2036 ఒలిపింక్స్‌ను ఇక్కడికి తెస్తడట. ఎంత ఖర్చు అయితదో తెలుసా ఈ సీఎంకు. 2016 ఒలిపింక్స్‌కు రియోలో లక్షా 8 వేల కోట్లు, 2020లో టోక్యోలో 2.9 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ ఖర్చు మన బడ్జెట్ అంత. ఈ మొగోడు ఒలింపిక్స్ హైదరాబాద్‌లో పెడుతాడట. 50 కోట్లకే ఒర్రుతుండు. నీ ముఖానికి అయితదా..? అంతర్జాతీయ ప్రమాణాతో ఈవెంట్ నిర్వహించడం తెలుసా..? అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. చేతనైతే మెగా ఇంజినీరింగ్ మీద పెట్టు కేసు. సుంకిశాలలో గోడ కూలిపోయింది 80 కోట్లు నష్టం వచ్చింది. దమ్ముంటే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదికి ఏసీబీని పంపు.. ఈస్టిండియా కంపెనీ అన్నావు కదా..? నీవు మొగోనివి అయితే పంపు.. ఏసీబీ కేసు పెట్టు. అవసరమైతే 50 లక్షలతో దొరికిన బ్యాగ్‌మెన్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. ఇవాళ రేస్ రద్దు చేయడం కారణంగా జరిగిన నష్టానికి రేవంత్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. మేం బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేశాం. మీరు బ్యాడ్ ఇమేజ్ క్రియేట్ చేస్తున్నాం. హైడ్రా పేరుతో విశ్వనగరం విజన్‌ను దెబ్బతీస్తున్నావ్ అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.

## సోషల్ మీడియా సైకోల భరతం పట్టాల్సిందే

**అమరావతి**: సోషల్ మీడియా.. సమాజ హితాన్ని కాంక్షిస్తుందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. అలాంటి సోషల్ మీడియాను కొంత మంది సైకోలు, సైకో పార్టీలతో కలిసి ఉచ్చ నీచం లేకుండా భ్రష్టు పట్టించారని ఆమె మండిపడ్డారు. మావన సంబంధాలు, రక్త సంబంధాలను సైతం మరిచి మృగాలుగా మారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలనే జ్ఞానం లేకుండా ఇంట్లో తల్లి, చెల్లి, అక్కా కూడా సాటి మహిళలే అనే కనీస ఇంగితం వారికి లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ప్రశ్నించే మహిళలపై అసభ్యకరంగా పోస్టులతో, వికృత చేష్టలతో వారంతా ఓ విధమైన రాక్షస ఆనందం పొందారని చెప్పారు. సోషల్ సైకోల బాధితుల్లో తాను ఒకరినని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల పేర్కొన్నారు. అసభ్యకర పోస్టులతో ప్రతిష్ట దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. అలాంటి పోస్టులు పెట్టి.. పైశాచిక ఆనందం పొందే సైకోలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన మీద.. తన కన్నతల్లి మీద.. చిన్నాన్న కుమార్తె వైఎస్ సునీతపై విచ్చలవిడిగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల గుర్తు చేసుకున్నారు. తాను వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారికే పుట్టలేదంటూ సోషల్ మీడియాలో అవమానించారని తెలిపారు. తన ఇంటి పేరు మార్చి శునకానందం పొందారని సైకోలపై వైఎస్ షర్మిల ఈ సందర్భంగా నిప్పులు చెరిగారు. తనపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీందర్ రెడ్డిపై తాను సైతం గతంలో పోలీస్ కేసు పెట్టిన విషయాన్ని ఈ సందర్భంగా వైఎస్ షర్మిల వివరించారు. అటువంటి సైకోను ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని తాను స్వాగతిస్తున్నానన్నారు. అరాచక పోస్టులు పెట్టే వాళ్ళు ఏ పార్టీలో ఉన్నా.. వారి అంతు చూడాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి వైఎస్ షర్మిల విజ్ఞప్తి చేశారు. మరోసారి సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడాలంటే భయపడేలా వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఉండాలని ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్ష పార్టీలైన అఏజీతిఆఖ అఏజీనిజా।నిజీఖజీసబా అఃఏఖ4ంనిటరసజీకు వైఎస్ షర్మిల సూచించారు. ఈ మేరకు వైఎస్ షర్మిల తన ఎక్స్ ఖాతా వేదికగా గురువారం ఈ విధంగా స్పందించారు.

## కుటుంబ సర్వేను విజయవంతం చేయండి

**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్త శుద్ధితో కృషిచేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై గురువారం ప్రత్యేకాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు.
ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. ఈ సర్వేకు సంబంధించి ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే ప్రక్రియ రేపటితో పూర్తవుతుందని, ఈ నెల 9 నుండి అసలు సర్వే మొదలవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు జిల్లా కలెక్టర్లు, సర్వే నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి సుశిక్షితులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలోనే ప్రథమంగా చేపట్టిన ఈ ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియని రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ సర్వేలో ప్రతీ ఒక్క కుటుంబం పాల్గొనేలా ప్రతీ రోజూ ప్రజలను చైతన్యపర్చేలా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఏ ఇంటిని కూడా వదలకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

# 11 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

**హైదరాబాద్:** రాష్ట్రంలో 11 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేంద్ర మంత్రి, భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారని వివరించారు. అలాగే ఆరు గ్యారెంటీల అమలులో విఫలం అయ్యారని అన్నారు. సంస్థాగతంగా భాజపాను బలోపేతం చేసుకోవాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై కార్యశాల నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు, రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయని చెప్పారు. భాజపాకు సంస్థాగత ఎన్నికల వ్యవస్థ ఊపిరి అని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. మహిళ, యువత, రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సంస్థాగత ఎన్నికలకు తెలంగాణ బీజేపీ సిద్ధం అవుతుంది.. ఈ నెల 15 వరకు సభ్యత్వ సేకరణ కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. నేటితో మెంబర్ షిప్ డ్రైవ్ చివరి దశకు చేరుకుంది. బూత్ , మండల, జిల్లా కమిటీ ల ఎన్నికలపై మార్గనిర్దేశర నిర్వహించేందుకు సిద్ధమైంది బీజేపీ. బూత్ కమిటీ ఎన్నికల షెడ్యూల్ పై చర్చ నిర్వహిస్తున్నారు ఈ నెల 15 నుండి 25 వరకు బూత్ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర , జిల్లా రిటర్నింగ్ అధికారుల నియామకం జరిగిన విషయం తెలిసిందే. తెలంగాణలో బీజేపీ సభ్యత్వం సుమారు 31 లక్షలు దాటిందని అంచనా వేస్తున్నారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచం లోనే అతి పెద్ద పార్టీ బీజేపీ అన్నారు. రెగ్యులర్ గా సంస్థాగత ఎన్నికల నిర్వహించుకుంటున్న పార్టీ బీజేపీ అని తెలిపారు. తెలంగాణ లో సుమారు 35 లక్షలు చేరుకుందని అన్నారు. ఈ నెల 15 వరకు సభ్యత్వ సేకరణ కొనసాగుతుందన్నారు. వివిధ స్థాయిల్లో బీజేపీ కమిటీల్లో 30శాతం కొత్త వారికి అవకాశం ఇచ్చారని తెలిపారు. బూత్ నుండి జాతీయ స్థాయి వరకు సమర్థులైన వారితో కమిటీ వేసినట్లు వెల్లడించారు. బీజేపీలో కొత్త వారిని చేర్పించాలని, భాగస్వామ్యులను చేయాలన్నారు. ఇతర పార్టీల్లో ఏమీ జరుగుతుంది తెలుసు. కుటుంబాల ఆధారంగా నడిచే పార్టీ లు అవి. ఆ పార్టీ లకి తరవాత ప్రెసిడెంట్ అవుతారో ముందే చెప్పొచ్చని తెలిపారు. బీజేపీ మాత్రం ప్రజాస్వామ్యంగా ముందుకు వెళ్తుంది? ఎవరైనా పార్టీ లో అధ్యక్షులు కావొచ్చన్నారు. ఇకపోతే తెలంగాణ పరిస్థితి పెనం నుండి పొయ్యి లో పడ్డట్టు అయిందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతుంది. ఒక కొత్త పెన్షన్ ఇవ్వలేదని మండిపడ్డారు. అప్పులు మాత్రం




విపరీతంగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేయాలని కిషన్ రెడ్డి తెలిపారు. ఒక వైపు సంస్థాగత అంశాల పై దృష్టి పెడుతూనే.. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. ప్రజలకు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. ధాన్యం కొనుగోలు కి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లు, మధ్య దళారులతో కుమ్మక్కు అయ్యి రైతులకు నష్టం కలిగిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి మాటలు కోటలు దాటుతున్నాయి కానీ పనులు మాత్రం జరగడం లేదన్నారు. ఇక్కడ ఇచ్చిన హామీలు అమలు చేసినట్టు మహారాష్ట్రలో దుర్మార్గంగా ప్రకటనలు ఇచ్చుకుంటున్నారు

## జగన్...గతం మరిచ విమర్శలా

అమరావతి: తన హయాంలో జరిగిన నేరాలు, ఘోరాలు గురించి కప్పిపుచ్చుకుని, ఇప్పుడు జగన్ నీతులు వల్లిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. జగన్ తన పాపాలను కప్పిపుచ్చుకోలేరని అన్నారు. కళ్లుండి చూడలేని కబోధిలా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారని మంత్రి అనగాని మండిపడ్డారు. చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలపై 25 శాతం మేర నేరాలు తగ్గాయని గురువారం అమరావతిలో ఆయన వివరించారు. మరి ఈ విషయం కనిపించడం లేదా? అంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మంత్రి అనగాని సత్య ప్రసాద్ సూటిగా ప్రశ్నించారు. మీ పాలనలో ప్రతి 8 గంటలకు ఒక రేప్, ప్రతి గంటకు ఇద్దరు మహిళలపై లైంగిక దాడులు జరిగేవని గుర్తు చేశారు. ఇది వాస్తవం కాదా జగన్? అంటూ మంత్రి అనగాని బల్లగుద్ది ప్రశ్నించారు. వ్యక్తిత్వ హననం చేయడంలో నిన్ను మించిన వాడు ప్రపంచంలోనే లేడంటూ వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. చివరకు తల్లిని, చెల్లిని సైతం ఈ జగన్ రెడ్డి వదల లేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అసభ్య పోస్టింగులు, సమాజాన్ని విధ్వంసం చేసే పోస్టులు పెట్టిన వారిని చట్టబద్దంగా అరెస్ట్ చేయడం చీకటి రోజులైతే... నీ పాలనలో పెట్టిన వేల కొద్ది అక్రమ కేసులను ఏమనాలి? జగన్ రెడ్డి అంటూ మంత్రి అనగాని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నేతలను నరికి చంపించిన నీవు శాంతిభద్రతలు గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అభివర్ణించారు.

## అక్రమంగా పిజి మెడికల్ సీట్ విక్రయం

హైదరాబాద్: పీజీ మెడికల్ కాలేజీ సీట్లు అక్రమంగా విక్రయించారనే అభియోగాలపై మాజీ మంత్రి సిహెచ్ మల్లారెడ్డికి ఈడీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. దీనిపై ఈ రోజు జరిగే విచారణకు హాజరు కావాలని ఆయనకు జారీ చేసిన నోటీసుల్లో ఈడీ స్పష్టం చేసింది. దీంతో ఈడీ ఎదుట విచారణకు మల్లారెడ్డి మెడికల్ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీకి ఆయన వివరణ ఇచ్చినట్లు సమాచారం. తెలంగాణలో పలు మెడికల్ కాలేజీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు విక్రయించారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ క్రమంలో ఈడీకి ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. అందులోభాగంగా గతేడాది జూన్‌లో మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి నివాసం, మెడికల్ కాలేజీతోపాటు కార్యాలయాలపై ఈడీ సోదాలు నిర్వహించింది. అలాగే 12 మెడికల్ కాలేజీల్లో సైతం సోదాలు చేపట్టింది. ఈ సందర్భంగా కీలక డాక్యుమెంట్లు, పెన్‌డ్రైవ్‌లు, హార్డ్‌డిస్క్‌లను సైతం ఈడీ స్వాధీనం చేసుకుంది. రాష్ట్రంలోని 10 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని 45 సీట్లను బ్లాక్ చేసి విక్రయించినట్లు.. ఈడీ తన సోదాల్లో గుర్తించింది. దాంతో దీనిపై వివరణ ఇవ్వాలంటూ మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డితోపాటు వివిధ ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

# పవన్ కళ్యాణ్‌తో హోంమంత్రి అనిత భేటీ



**అమరావతి,:** హోంమంత్రిపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల అనంతరం ఏపీ రాజకీయాలు వేడెక్కిన క్రమంలో హోంమంత్రి అనిత డిప్యూటి సిఎం పవన్ కళ్యాణత్‌తో భేటీ అయ్యారు.
డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఫేక్ పోస్టులపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హోం శాఖ తీసుకుంటున్న చర్యలను పవన్ కల్యాణ్‌కు అనిత వివరించారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆడబిడ్డలకు అన్యాయం చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు అనిత తెలిపారు. జన సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రతిక్షణం శ్రమించే ప్రజా ప్రభుత్వం మన కూటమి ప్రభుత్వమని నేతలు చర్చించుకున్నారు. తానూ ఫేక్ పోస్టు బాధితురాలినంటూ అంటూ అనిత పవన్ కల్యాణ్‌తో అన్నారు. తన కూతురు కన్నీరు చూసే తాను ఇటీవల కొన్ని వ్యాఖ్యలు చేశానని పవన్ వెల్లడించారు. ఈ క్రమంలో హోం మంత్రి అనిత ఆసక్తికర పోస్ట్ చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్ తో మార్యదపూర్వకంగా సమావేశమైనట్లు పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హోంశాఖ తీసుకుంటున్న చర్యలను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఆడబిడ్డలకు అన్యాయం చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా గట్టి చర్యలు తీసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించారన్నారు. జన సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రతిక్షణం పరిశ్రమించే ప్రజా ప్రభుత్వం తమ కూటమి ప్రభుత్వం అంటూ అనిత పేర్కొన్నారు. ఇటీవల పిఠాపురం పర్యటనలో రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, అత్యాచారాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో హోం మంత్రి బాధ్యత వహించాలని.. మరింత కఠినంగా వ్యవహరించాలంటూ పవన్ కల్యాణ్ సూచించారు.

## సోషల్ మీడియా దుష్ప్రచారం దారుణం

**అమరావతి:** పులివెందుల ఎమ్మెల్యే నోటి నుంచీ వినకూడని మాటలు వస్తున్నాయని హోంమంత్రి వంగలపూడి అనిత ఎద్దేవా చేశారు. రాజకీయాలలో ఎవరున్నా.. మా కుటుంబ సభ్యులను సైతం నీచంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి మహిళా రైతులు మానసిక క్షోభకు గురయ్యారన్నారు. మేం ఏరోజూ మిమ్మల్ని అడ్డుకోలేదన్నారు. ఇప్పుడు మీ ఆఫీసుల మీద దాడులు జరగలేదే అంటూ జగన్‌ను ఉద్దేశించి మాట్లాడారు. మాది ప్రజారంజక పరిపాలన.. 28 శాతం క్రైం రేట్ తగ్గిందన్నారు. రాజకీయ లబ్దికోసం అభంశుభం తెలీని ఆడపిల్లల విషయంలో మాట్లాడొద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసులను పని చేయనివ్వలేదని విమర్శించారు. మేం చేస్తున్న అరెస్టులు తప్పు కాదని.. ఏది పడితే అది మాట్లాడితే చూస్తూ ఊరుకోవాలా అంటూ మండిపడ్డారు.

# భుజాలు తడుముకుంటున్న కెటిఆర్



**మహబూబాబాద్:** 'గుమ్మడి కాయల దొంగ అంటే.. భుజాలు ఎందుకు తడుముకుంటున్నవ్ కేటీఆర్..?' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్.. నువ్వు చేసిన తప్పేంటో నీకు తెలుసు.. పడబోయే శిక్ష ఏంటో నీకు తెలుసు' అని అన్నారు. 11 నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అన్నారు. గురువారం తొర్రూర్ వ్యవసాయ నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడుతూ.. 'తల తాకట్టు పెట్టయిన డిసెంబర్ లోపు 13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని అన్నారు. 'రుణమాఫీ అయ్యాక నీ తల ఏ టైర్ కింద పెడతావో ఆలోచించుకో' అని అన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరే సమయంలో కేసీఆర్‌ను తండ్రిలా భావించి కాళ్లు మొక్కానని అన్నారు. కానీ తడిగుడ్డతో గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నాలుగు గోడల మధ్య కాళ్లు పట్టుకొనే అవసరం లేదని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు 'పొంగులేటి హోం మంత్రా..? అలా ఎందుకు మాట్లాడుతున్నారు' అని అంటున్నారని, తాను క్యాబినెట్ మంత్రినని, అన్ని విషయాలూ మాట్లాడుతానని అన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానని అంటున్నారని, పాదయాత్ర చేస్తారో.. మోకాళ్ల యాత్ర చేస్తాడో నిర్ణయం ఆయనే తీసుకోవాలని పొంగులేటి ఎద్దేవా చేశారు. తాను ఆ పార్టీ, ఈ పార్టీ నేతలను అరెస్టు చేస్తారని ఎక్కడా చెప్పలేదని తెలిపారు. దానికి శ్రీనివాస్ రెడ్డి అదాని కాళ్లు మొక్కాడని ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తనకు చట్టం తెలుసునని, ఎప్పుడు, ఎక్కడ ఏం జరగాలో అది జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వం 7 లక్షల 19 కోట్ల రూపాయలు అప్పు చేసి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు.. ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం మీద బావ బావమరిది తప్పుడు ప్రచారు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రత్యక్షంగా రైతుల కోసం ఇప్పటి వరకు రూ. 18 వేల కోట్లు రుణమాఫీ చేశాం.. మిగతా 12 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. బావ బావమరిది తల ఎక్కడ పుట్టుకుంట్టారో అప్పుడు చెప్తుతామని అన్నారు. పేదల పక్షపాతి ప్రభుత్వం కాబట్టి రైతుబంధు కొంచెం ఆలస్యమవుతుందని మంత్రి అన్నారు. తాము ఇచ్చే స్మార్ట్ కార్డు ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకానికి అని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణిలో విదేశాల సంస్థలకు ఇచ్చిన భూమిని మళ్ళీ తీసుకొస్తున్నాం.. దేశంలో ఎక్కడ లేనటువంటి కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. తప్పు చేస్తే పేదవాడి సొమ్మును కొల్లగొడితే పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గుమ్మడికాయ దొంగ అంటే కేటీఆర్ ఎందుకు భయపడుతున్నావో చెప్పాలన్నారు. నీవు ఎందుకు పాదయాత్ర చేస్తున్నావో ప్రజలకు చెప్పాలని తెలిపారు. మనిషిని మనిషిలా గౌరవించని మీరు.. పదవిపోయే సరికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. చట్టానికి తెలుసు.. ఎప్పుడు, ఎక్కడ ఏమి జరగాలో తెలుసు.. త్వరలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రైతులకిచ్చిన మాటని తుచ తప్పకుండా చేస్తామన్నారు. రైతన్నలకి, నిరుద్యోగులకు ఈ ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల వరకు కొత్త పింఛన్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అన్ని పథకాలు ఇచ్చి తీరుతామని మంత్రి పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి అలాగే ప్రభుత్వా విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎంపీలు, బలరాం నాయక్, కడియం కావ్య పాల్గొన్నారు.

# కాశీలో స్వర్గ రథాన్ని ప్రారంభించిన మంచాల జ్ఞానేందర్.

**వేగుచుక్క న్యూస్, నవంబర్ 7**




కాశీ పట్టణంలో కీర్తిశేషులు మంచాల శంకరయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు మంచాల జ్ఞానేందర్, ఉత్తర ప్రదేశ్ ప్రత్యేక పోలీస్ అధికారి నిధిదేవ్ అగర్వాల్ ఆధ్వర్యంలో స్వర్గ రథాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాశి పత్రకార్ సంగ్ పరాత్కర్ భవన్ లో విలేకరులతో జ్ఞానేందర్ మాట్లాడుతూ, తన తండ్రి మంచాల శంకరయ్య గుప్తా పేరుతో చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నానని అన్నారు. అందులో భాగంగా తన స్వస్థలమైన తెలంగాణలోని నిజామాబాద్ నగరంలో అదేవిధంగా బోధన్, బాన్సువాడ, సికింద్రాబాద్, హైదరాబాద్, సిరిసిల్ల, వేములవాడ, కనగర్తి పట్టణాల్లో ఉచిత స్వర్గ రథాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అంతేకాకుండా శవయాత్ర రోజు 50 మందికి ఉచిత భోజన వసతి కూడా కల్పిస్తున్నామని అన్నారు.ప్రధాని నరేంద్ర మోడీ పై ఉన్న గౌరవంతో ప్రతి హిందువు ఇంట్లో భగవద్గీత ఉండాలనె సంకల్పంతో ఉచితంగా భగవద్గీత బుక్కులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు 7వేలకు పైగా భగవద్గీత బుక్కులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. గతంలో నేను కాశీకి వచ్చినప్పుడు ఇక్కడ ఎటువంటి స్వర్గ రకాలు లేని విషయాన్ని గమనించానని, నాకు కలిసి ఇక్కడి పరిస్థితులు వివరించడంతో స్వర్గ రథాన్ని అందిస్తానని కాశి మోక్షదాం నుంచి దీన్ని వినియోగించాలని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ హామీ మేరకు స్వర్గ రథాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ స్వర్గ రథంపై ఉన్న ఫోన్ నం కు ఫోన్ చేసి కాశి నగర ప్రజలు ఉచితంగా వాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచాల శ్రీలక్ష్మి, పవన్, కేశవులు, బెజవాడ ఆగమయ్య, వేదవతి, కాశీ మోక్ష ట్రస్ట్ సభ్యులు, సివిల్ డిఫెన్స్ వారణాసి, కేశవ్ జగన్, వార్డెన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# "జీవనభృతి" కోసం బీడి కార్మికుల భారి ర్యాలి.

## - రాజంపేట తహసీల్దారు కార్యాలయం ముట్టడి.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 7:**





కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీవన భృతి పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీడి కార్మికులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. గురువారం రాజంపేట మండల కేంద్రంలో బిఎల్ టీయూ , ఏఐఎఫ్ టియూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, తహసీల్దార్ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం(బిఎల్ టీయూ) రాష్ట్ర అధ్యక్షులు యస్. సిద్దిరాములు, కార్యదర్శి ఆంజనేయులు, శ్రామిక శక్తి బీడీ వర్కర్ద్ యూనియన్ (ఏఐఎఫ్ టియూ) రాష్ట్ర నాయకులు వెంకటలక్ష్మీ, అనుసూయ మాట్లాడారు.
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది బీడీ కార్మికులకు షరతులు లేకుండా రూ"4016 జీవన భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. గత 15 రోజులుగా కామారెడ్డి నియోజకవర్గంలో వేలాదిమంది బహుజన కులాలకు చెందిన బీడీ కార్మికులు జీవన భృతి చెల్లించాలని ఆందోళనాలు చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే కనీసం స్పందించడం లేదని అన్నారు. బీడీ కార్మికులందరికి ఎలాంటి షరతులు లేకుండా రూ" 4016 జీవన భృతి సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎల్ టీయూ , ఏఐఎఫ్ టియూ నాయకులునాగారపు యెల్లయ్య, కె. లింగం, నాంపల్లి, యం. బాస్కర్, పంచాక్షరీ, బాల్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# వైజ్ఞానిక విజ్ఞాన యోధుడు సర్ సివి రామన్.

## - సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.





**వేగుచుక్క న్యూస్, సిరికొండ, నవంబర్ 7:**

వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చేసి, అబ్బురపరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా, వైజ్ఞానిక శాస్త్రానికే విజ్ఞాన యోధుడు సర్ సివి రామన్ అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. వైజ్ఞానిక రంగంలో తొలి నొబెల్ పురస్కారం, ప్రతిష్టాత్మక భారతరత్న అందుకున్న తొలి విజ్ఞాన కెరటం సర్ చంద్రశేఖర వెంకట రామన్ 136వ జయంతిని గురువారం సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య ఉపాధ్యాయులతో కలిసి అయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ, సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేధించి ప్రపంచ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన ధృవతార, భవిష్యత్ తరాల స్ఫూర్తి ప్రదాత సర్ చంద్రశేఖర్ వెంకటరామన్ (సీవీ రామన్) అని అన్నారు. ఆకాశం, సముద్రం నీలి రంగు వర్ణంలో ఉండడం, పగలు నక్షత్రాలు కనబడక పోవడం వంటి చిత్ర విచిత్ర శాస్త్రీయ సందేహాలకు తన పరిశోధనలతో శాస్త్రీయంగా నిరూపించిన అత్యున్నత ప్రతిభావంతుడు, కేవలం రూ. 200 ఖరీదుచేసే పరికరాలతో తన ప్రయోగాన్ని చేపట్టి విజయం సాధించి ప్రతిష్టాత్మకమైన నోబెల్ పురస్కారం అందుకుని ప్రపంచానికి కాంతి పుంజంగా నిలిచారన్నారు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తిల్లో సర్ సీవి రామన్ మొదటివారని, రేపటి ప్రపంచ ఆవశ్యకతలను, సవాళ్లను దృష్టిలో ఉంచుకుని
సమూలమైన పరిష్కారాలు అందించడమే లక్ష్యంగా నవీన శాస్త్ర వేత్తలు ఉండాలని నర్సయ్య ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ పరీక్ష, శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ సైన్స్, మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంపూర్ణ వికాసానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదం.

## - స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె. సాల్మన్.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, నవంబర్ 7:**



స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఉత్తమ వ్యక్తిత్వం, క్రమశిక్షణతో పాటు సంపూర్ణ వికాసానికి దోహదపడుతుందని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె. సాల్మన్ అన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం సత్యశోధక్ పాఠశాలలో పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి కె. సాల్మన్ మాట్లాడుతూ, విద్యార్థులలో చురుకుదనం, ఉత్సాహం, స్నేహశీలత, సహనం పట్టుదలను పెంపొందించుకొని సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. మానవీయతతో కూడిన ఆలోచనలు ఉత్తమ సమాజ నిర్మాణానికి పునాది అవుతుందని, దేశ భవిష్యత్తుకు పట్టుకొమ్మలైన యువత వినూత్న ఆలోచనలతో పరిణతి చెందిన విజ్ఞానభావ ప్రపంచంలో ప్రగతిశీల కథానాయకులు కావలన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ వనిత, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విరివిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు.





**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 7**

## ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ.శరత్.

## ఇంటింటి సర్వే, ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష.

ఆరుగాలం శ్రమించి పంట సాగు చేసిన రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు ధర అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం విరివిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, రాష్ట్ర గిరిజనాభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ డాక్టర్ ఏ.శరత్ తెలిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ లతో కలిసి గురువారం ఇందల్వాయి మండలం చంద్రాయణపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రత్యేక అధికారి శరత్ తనిఖీ చేశారు. రైతులను పలుకరించి, ధాన్యం సేకరణ తీరుతెన్నుల గురించి అడిగి తెలుసుకున్నారు. ధాన్యం అమ్మకం విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీయగా, ఎలాంటి సమస్యలు లేవని రైతులు తెలియజేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులు రోజుల తరబడి వేచిచూడాల్సి పరిస్థితి ఉత్పన్నం కాకుండా, ధాన్యం తూకం జరిపించాలని అధికారులకు సూచించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట రైస్ మిల్లులకు తరలించాలని, రవాణాపరమైన ఇబ్బందులు ఏర్పడకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.

**అధికారులతో సమీక్షి.**

ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేను నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి డాక్టర్ ఏ.శరత్ సూచించారు. స్థానిక రోడ్లు- భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన జిల్లా అధికారులతో సమావేశమై ఇంటింటి సర్వే ప్రగతిని సమీక్షించారు. ప్రతి నివాస గృహాన్ని ఎన్యూమరేటర్లు సందర్శించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో పక్కాగా కుటుంబ వివరాలు సేకరించేలా చూడాలన్నారు. సర్వే ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, తప్పిదాలకు తావు లేకుండా నిర్ణీత కాల వ్యవధిలోపే సర్వే పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని హితవు పలికారు. ప్రత్యేక అధికారి వెంట ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం రాజేశ్వర్, డీసీఓ శ్రీనివాస్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగూరావు తదితరులు ఉన్నారు.

# డిఇఓ అశోక్ కు ఏఐటియుసి అభినందన

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 7:**



నూతనంగా జిల్లాకు విచ్చేసిన డీఈవో అశోక్ కు గురువారం (ఏఐటియుసి) తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై. ఓమయ్య, ప్రధాన కార్యదర్శి టి. చక్రపాణి కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై డిఇఓ తో చర్చించారు. ప్రధానంగా ప్రభుత్వం ఈ మధ్యకాలంలో వంటపాత్రలకు విడుదల చేసిన బిల్లును విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూళ్లకు కేటాయింపులు జరపాలని, మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రొసీడింగ్ ఆర్డర్లు ఇవ్వాలని, కొత్త మెనూ చార్జీలు వచ్చేంతవరకు కార్మికులపై మెనూ ప్రకారం భోజనం చెల్లించడానికి ఒత్తిడి చేయొద్దని కోరారు. పై సమస్యలపై డీఈవో అశోక్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

# ఎలక్ట్రిసిటీ ఎస్ఈ శ్రావణ్ కుమార్ కు సన్మానం.

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 7:**



మంచిర్యాల జిల్లా నుండి కామారెడ్డి జిల్లా అధికారిగా బదిలీపై నూతనంగా విచ్చేసిన ఎలక్ట్రిసిటీ ఎస్ఈ ఎన్. శ్రావణ్ కుమార్ ను పలువురు గురువారం సన్మానించారు. ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా రిటైర్డ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు ఎం రాజన్న, జిల్లా కార్యదర్శి సాయ గౌడ్, జేఏసీ చైర్మన్ బ్రహ్మం , డివిజన్ అధ్యక్షులు రఘు కుమార్, లక్ష్మణరావు, ప్రతినిధులు చంద్రకాంత్, రహీం, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఎంసి డైరెక్టర్ కు బార్ అసోసియేషన్ సన్మానం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 7:**




మార్కెట్ కమిటీ డైరెక్టర్గా ఇటీవల నియమితులైన న్యాయవాది నరేందర్ ను గురువారం నిజామాబాద్ బార్ అససియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ, జూనియర్ న్యాయవాది గా ఉన్న నరేందర్, భవిష్యత్తులో అనేక పదవులు అధిరోహించి, ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించారు .ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది రాజ్ కుమార్ సుబేదార్, న్యాయవాదులు పిల్లి శ్రీకాంత్, నారాయణదాసు, పరుచూరి శ్రీధర్, నారాయణ, పులి జైపాల్, ఆర్ఎస్ఎల్ గౌడ్, కేశవులు, సుదర్శన్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొప్పిడి అనుసూజ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 7:**



**కలెక్టరేట్ వద్ద డ్వాక్రా గ్రూపు సభ్యుల ధర్నా.**
**16 డ్వాక్రా గ్రూపులను మోసం చేసినట్టు ఆరోపణలు.**
**మెప్మా పీడీ రాజేందర్ కు వినతి పత్రం.**

నగరంలోని గాజులపేట్ ప్రాంతానికి చెందిన బొప్పిడి అనుసూజ రెడ్డి, మహిళా సంఘం నాయకురాలిగా చలామణి అవుతూ 16 డ్వాక్రా గ్రూపులను, 200 మంది డ్వాక్రా మహిళలను మోసం చేసిన ఘటనపై విచారణ చేపట్టాలని నవయుగబాట సమైక్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత డ్వాక్రా మహిళలతో గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, మెప్మా పీడీ రాజేందర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమైక్య అధ్యక్షురాలు అంతని విజయ మాట్లాడుతూ, అమాయకులైన మహిళల పేరుతో బ్యాంకులో లోను తీసుకొని సగం డబ్బు మాత్రమే డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఇచ్చిందని అన్నారు. మిగతా డబ్బు తన వద్ద ఉంచుకుని, తిరిగి మొత్తం డబ్బులు వడ్డీతో చెల్లించాలని ఒత్తిడి చేస్తుందని అన్నారు. 16 స్వయం సహాయక సంఘాలను మెప్మా కు సంబంధం లేకుండా 10 సంవత్సరాలుగా కొనసాగిస్తున్న అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించారని ఆరోపించారు. ఎదిరించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తానని బెదిరింపులకు గురిచేస్తూ వడ్డీ వ్యాపారాలను కొనసాగిస్తుందని అన్నారు. లైసెన్సు లేకుండా చిట్టీలు నిర్వహిస్తూ, చక్రవడ్డీలను వసూలు చేస్తుందని, మహిళలకు చెల్లించాల్సిన పొదుపు డబ్బులను కూడా తమ సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకొని ఏ ఒక్కరికి డబ్బులు ఇవ్వలేదని అన్నారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ చేపట్టి డ్వాక్రా మహిళలను మోసం చేస్తున్న బొప్పిడి అనుసూజరెడ్డి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, రమాబాయి, సవిత, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.




# సెంటిమెంట్ వర్కౌట్ అవుద్దా

సంక్రాంతికి వస్తున్నాం అనే టైటిల్ గురించి గత నాలుగైదు రోజులుగా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి అనిల్ రావిపూడి, వెంకీమామ సినిమాను బరిలోకి దించాలని దిల్ రాజు ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. శతమానం భవతి 2 చిత్రాన్ని సంక్రాంతి బరి నుంచి తప్పించినట్టుగా అనిపిస్తోంది. వెంకటేష్ తన స్థాయిలో ఎప్పుడూ ఏదో ఒకటి కొత్తగా ప్రయత్నిస్తుంటాడు. గురు అయినా ఎఫ్ 2 వంటి కామెడీ చిత్రాలైనా సరే వెంకీమామ ఎప్పుడూ ప్రేక్షకులను మెప్పించేందుకు కష్టపడుతుంటాడు. ఈ మధ్య కాలంలో వెంకీమామ టైమింగ్‌ను వాడుకున్నది మాత్రం అనిల్ రావిపూడి అని చెప్పుకోవచ్చు. ఎఫ్ 2, ఎఫ్ 3 సినిమాలు కొన్ని సార్లు క్రింజ్ అనిపించొచ్చు. ఇదేం కామెడీ.. ఇవేం సినిమాలు అని అనిల్ రావిపూడి మీద ట్రోలింగ్ రావొచ్చు. కానీ వెంకీ మామ ఇంతలా కామెడీ చేసి చాలా కాలమే అయింది. అప్పుడెప్పుడో త్రివిక్రమ్ రైటింగ్‌లో వెంకీ మామ నవ్వులు పూయించాడు. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరీ రేంజ్‌లో నవ్వించిన చిత్రాలు చాలా తక్కువ. ఎఫ్ 2, ఎఫ్ 2లో వెంకీ మామ ప్రేక్షకుల్ని బాగానే నవ్వించాడు. ఎంతో సీరియస్ మోడ్‌లో ఉన్న పాత్రలో వెంకీ మామ సైంధవ్‌గా చేస్తే జనాలు అంతగా రిసీవ్ చేసుకోలేదు. అందుకే వెంకీ మామ ఇకపై వినోదాత్మక చిత్రాలు చేయాలని చూస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలోనే వెంకీ మామ ఓ కథకు ఓకే చెప్పాడని, పూర్తి వినోదాత్మకంగా ఆ స్క్రిప్ట్‌ను అనిల్ రావిపూడి మలిచాడని సమాచారం. ఈ మూవీకి సంక్రాంతికి వస్తున్నాం అనే క్యాచీ టైటిల్‌ను ఫిక్స్ చేసినట్టుగా టాక్. ఈ మూవీకి 50 కోట్ల బడ్జెట్ అవుతుందని లెక్కలు వినిపిస్తున్నాయి. ఈ మూవీలో మీనాక్షి చౌదరిని హీరోయిన్‌గా తీసుకుంటారని సమాచారం. అయితే సంక్రాంతి సెంటిమెంట్‌ను బేస్ చేసుకుని ఈ సారి కూడా దిల్ రాజు బరిలోకి దిగాలని ఫిక్స్ అయ్యాడు. మరి ఈ సంక్రాంతి సెంటిమెంట్.. ఈ సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమాకు కలిసి వస్తుందా? లేదా? అన్నది చూడాలి. సంక్రాంతి సీజన్‌లో వచ్చిన ఎఫ్ 2 బాగాన ఆడింది. వంద కోట్ల క్లబ్బులో చేరింది. కానీ ఎఫ్ 3 మాత్రం అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఎఫ్ 3 చిత్రానికి ఆశించినంత వసూళ్లు రాలేదని సమాచారం.



# 'విశ్వంభర'లో మరో ఇద్దరు..

మెగాస్టార్ చిరంజీవి లేటెస్ట్ మూవీ విశ్వంభర ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటుంది. అయితే తాజాగా ఈ మూవీ సెట్స్‌లో మరో ఇద్దరు హీరోయిన్లు జాయిన్ అయినట్లు తెలుస్తోంది.

బింబిసార డైరెక్టర్ వశిష్టతో చిరంజీవి చేస్తున్న 'విశ్వంభర' సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే షూటింగ్ మొదలుపెట్టిన ఈ చిత్రంలో తాజాగా మరో ఇద్దరు హీరోయిన్లు జాయిన్ అయ్యారు.

యంగ్ బ్యూటీ ఈషా చావ్లాకి విశ్వంభరలో అవకాశం దక్కినట్లు సమాచారం. నటుడు సాయి కుమార్ కొడుకు ఆది హీరోగా వచ్చిన 'ప్రేమ కావాలి' సినిమాతో గుర్తింపు తెచ్చుకుంది. ఈషా. ప్రస్తుతం విశ్వంభరలో ఆమె ఓ ముఖ్యమైన పాత్రలో కనిపించబోతుందట.

ఇక హుషారు మూవీ ఫేమ్ రమ్య పసుపులేటి కూడా ఈ సెట్స్‌లో జాయిన్ అయింది. తాజాగా హైదరాబాద్‌లో జరుగుతున్న షూటింగ్ సెట్‌లో చిరంజీవితో తీసుకున్న ఫొటోను షేర్ చేస్తూ ఈ విషయాన్ని ప్రకటించింది రమ్య. మెగాస్టార్ పక్కన నటించే, డ్యాన్స్ చేసే అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది.. ఈ ఛాన్స్ ఇచ్చిన డైరెక్టర్ వశిష్టకి థ్యాంక్స్ అంటూ ఆమె పోస్ట్ పెట్టింది.

ఇక ఈ చిత్రంలో త్రిష మెయిన్ హీరోయిన్‌గా నటిస్తున్న సంగతి తెలిసిందే. అలానే హీరోయిన్ సురభి కూడా ఈ మూవీలో నటిస్తుంది. దీంతో మొత్తానికి ఇప్పటికే విశ్వంభరలో నలుగురు హీరోయిన్లు అయ్యారు. అయితే ఈ సినిమాలో భారీ తారాగణం ఉంటుందని ఇప్పటికే వశిష్ట పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు. దానికి తగ్గట్లే స్టార్ క్యాస్టింగ్‌ను అనౌన్స్ చేస్తున్నారు. మరి ఇతర పాత్రలకి ఇంకెవరు వస్తారో చూడాలి. ఈ సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్‌ను యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఎమ్ ఎమ్ కీరవాణి మ్యూజిక్ అందిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. ధీమాగాఈ ప్రాజెక్ట్ గురించి వశిష్ట చాలా ధీమాగా ఉన్నాడు. చిరంజీవి కెరీర్‌లోని టాప్ 3 సినిమాల్లో ఒకటిగా విశ్వంభర నిలుస్తుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. ఆడియన్స్‌ను థ్రిల్ చేసే కొత్త ప్రపంచాన్ని ఈ సినిమా కోసం సృష్టిస్తున్నట్లు తెలిపాడు. ఇక 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమాలానే విశ్వంభర కూడా భారీ హిట్ అవుతుందంటూ చెబుతున్నాడు. గతంలో కూడా ఈ చిత్రం గురించి వశిష్ట ఇలాంటి కామెంట్స్‌యే చేశారు. ఒకప్పటి మెగాస్టార్‌ను అభిమానులకు, ఇప్పటి ఆడియన్స్‌కి కూడా నచ్చే విధంగా సినిమాను ప్రెజెంట్ చేస్తున్నా అన్నాడు. కళ్యాణ్ రామ్‌తో వశిష్ట తీసిన బింబిసార సినిమా భారీ హిట్‌గా నిలిచింది. అనంతరం చిరుకి వశిష్ట చెప్పిన స్టోరీ నచ్చడంతో విశ్వంభరకి ఓకే చెప్పేశారు. ఇటీవల భోళా శంకర్‌గా వచ్చిన చిరు ఆడియన్స్‌ను మెప్పించలేకపోయారు.



# మౌనికపై మనోజ్ ప్రేమ

మంచు మనోజ్ తాజాగా తమ పెళ్లి రోజు సందర్భంగా భార్య మౌనికపై ప్రేమను కురిపించాడు. ఏది ఏమైనా, ఏం ఎదురైనా, ఏం వచ్చినా కూడా తన ప్రాణాలు అడ్డు పెట్టి రక్షిస్తానంటూ, జాగ్రత్తగా చూసుకుంటాను అంటూ.. భార్య మీద తనకున్న అనంతమైన ప్రేమను చూపించాడు. మంచు మనోజ్ భూమా మౌనికల పెళ్లి గత ఏడాది జరిగిన సంగతి తెలిసిందే. మార్చి 3న 2023లో మంచు మనోజ్, భూమా మౌనికల పెళ్లి ఘనంగా జరిగింది. ఇక పెళ్లై ఏడాది అవుతున్న సందర్భంగా మంచు మనోజ్ తన భార్య మీద



ప్రేమను కురిపించాడు. ఈ ఏడ్జాది ప్రయాణానికి సంబంధించిన విషయాలను పంచుకున్నాడు. ప్రతీ క్షణం ఎంతో ఆనందంగా గడిచిందని చెప్పుకొచ్చాడు. ఇప్పుడు ఎప్పుడూ ఇలానే ప్రేమిస్తుంటాను అంటూ మౌనిక మీద ప్రేమను కురిపించాడు. 'నా ప్రియమైన భార్య మౌనికకు పెళ్లి రోజు శుభాకాంక్షలు.. నీతో ఉన్న ప్రతీ క్షణం ఎంతో సంతోషంగా గడుస్తుంటుంది.. నిన్ను, ధైరవ్‌ను నా జీవితంలోకి పంపిన ఆ దేవుడ్ని థాంక్స్.. మన బిడ్డ కూడా త్వరలోనే రాబోతోన్నాడు.. నీ రాకతో నా జీవితం పూర్తిగా మారిపోయింది.. ఎంతో అద్భుతంగా సాగుతోంది.. మీ అమ్మనాన్నల్లా నిన్ను నేను చూసుకోలేకపోవచ్చు గానీ.. నిన్ను మాత్రం జీవితాంతం రక్షిస్తూ ఉంటా.. నా జీవితంలో నీకు ప్రత్యేక స్థానం ఉంటుంది.. ఏం జరిగినా సరే నిన్ను నా ప్రాణాలు అడ్డు పెట్టి రక్షిస్తూ ఉంటా.. ఇంకా ఇలాంటి రోజులెన్నో మనం జరుపుకోవాలి.. పెళ్లి రోజు శుభాకాంక్షలు భార్యామణి.. నా జీవితపు ప్రేమవి నువ్వే'.. అంటూ ఇలా మంచు మనోజ్ వేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇక వెడ్డింగ్ యానివర్సరీ సందర్భంగా ఫ్యామిలీని బయటకు తీసుకెళ్లినట్టుగా కనిపిస్తోంది. ఈ మేరకు మనోజ్ షేర్ చేసిన వీడియో, ఫోటోలు నెట్టింట్లో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. మంచు మనోజ్ ప్రస్తుతం బుల్లితెరపై టాక్ షోలు చేస్తున్నాడు. సినిమాలతోనూ బిజీగా ఉన్నాడు. వాట్ ది ఫిష్ అనే చిత్రాన్ని లైన్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. కరోనా కంటే ముందు అహం బ్రహ్మాస్మి అనే సినిమాను అనుకున్నాడు. కానీ ఆ సినిమాను ఇప్పుడు పక్కన పె పెట్టేసిన సంగతి తెలిసిందే.



# బాలీవుడ్ స్టార్ ఎంట్రీ!

పుష్ప 2 సినిమా ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తి చేసి ఆగస్టు 15న అనుకున్న టైమ్‌కి సినిమాను రిలీజ్ చేయాలని బన్నీ అనుకుంటున్నాడు. అయితే తాజాగా ఈ సినిమా గురించి మరో క్రేజీ న్యూస్ వైరల్ అవుతోంది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న పుష్ప 2 సినిమా కోసం ఆడియన్స్ తెగ ఎదురుచూస్తున్నారు. సుకుమార్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రం గురించి రోజుకో న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా ఈ చిత్రంలో మరో స్టార్ యాక్టర్ కూడా నటిస్తున్నాడంటూ ప్రచారం జరుగుతోంది. ఓ ముఖ్యమైన పాత్ర కోసం ఆ బాలీవుడ్ స్టార్‌ను రంగంలోకి దింపుతున్నారని టాక్.

సంజయ్ దత్ ఎంట్రీ!.... లేటెస్ట్ టాక్ ప్రకారం బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కోసం పుష్ప 2లో ఓ కీలక పాత్రను ప్లాన్ చేశారట. సినిమాలో ఓ హై పాయింట్ దగ్గర సంజయ్ దత్ పాత్ర ఎంట్రీ ఇస్తుందట. డాన్ క్యారెక్టర్‌లో సంజయ్ కనిపిస్తారని అంటున్నారు. కేజీఎఫ్ 2లో సంజయ్ దత్ చేసిన అధీర పాత్రకి సూపర్ రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. విలన్ రోల్‌లో సంజయ్ ఇరగదీశాడు. దీంతో పుష్ప 2 సినిమాలో సంజయ్ దత్ ఉంటే హిందీలో సినిమాకి ఇంకా ప్లస్ అవుతుందని మూవీ టీమ్ భావిస్తుందంట. అయితే ఇది కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారమే. కానీ ఇప్పటివరకూ మూవీ టీమ్ దీనిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ ఈ సీక్వెల్‌లో పుష్పలో ఉన్న పాత్రలతో పాటు కొన్ని కొత్త క్యారెక్టర్స్ కూడా ఉంటాయని తెలిసింది. ఇక భన్వర్ సింగ్ షెకావత్ క్యారెక్టర్ చేస్తున్న ఫహద్ ఫాజిల్ పుష్ప 2లో సినిమా మొత్తం ఉంటారని టాక్. ఎందుకంటే పుష్పలో సెకండాఫ్‌లో ఈ క్యారెక్టర్ ఎంట్రీ ఇచ్చింది. ఇక ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ భారీ ఎత్తున నిర్మించింది. దేవి శ్రీ ప్రసాద్ సినిమాకి మ్యూజిక్ అందిస్తున్నారు. ఆగస్టు 15న ఈ సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది. పుష్ప 3ఇక ఇటీవల పుష్ప 3పై కూడా అల్లు అర్జున్ కామెంట్స్ చేసిన సంగతి తెలిసిందే. పుష్పను ఒక ఫ్రాంచైజీగా మార్చాలనే ఆలోచన తమకి ఉందని, కనుక పుష్ప 3పై ఆశలు పెట్టుకోవచ్చంటూ డైరెక్ట్‌గానే చెప్పాడు బన్నీ. అయితే పుష్ప 3 వెంటనే రాకపోవచ్చని.. కానీ తీసే అవకాశం చాలా ఎక్కువ ఉందంటూ చెప్పుకొచ్చాడు. నిజానికి పుష్ప సినిమాను కేవలం ఒక పార్ట్‌గానే తీద్దామని అనుకున్నారు. కానీ షూటింగ్ మొదలైన తర్వాతే రెండు భాగాలుగా మార్చాలనే ఆలోచన వచ్చింది. ఇది సినిమాకి బాగా ప్లస్ అయింది. పుష్ప సినిమా భారీ హిట్ కొట్టడంతో పార్ట్ 2పై అంచనాలు భారీగా పెరిగాయి.



# టాలీవుడ్ ఎంట్రీపై రియాక్షన్..

ప్రేమలు సినిమా మార్చి 8న తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ కాబోతుంది. ఇప్పటికే మలయాళంలో హిట్ అయిన ఈ చిత్రంపై తెలుగులోనూ మంచి అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ మూవీ హీరోయిన్ టాలీవుడ్ ఎంట్రీపై కామెంట్స్ చేసింది. మాలీవుడ్ లేటెస్ట్ సెన్సేషన్ 'ప్రేమలు' సినిమా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరేందుకు పరుగులు పెడుతోంది. నస్లెన్, మమిత బైజు జంటగా నటించిన ఈ చిత్రం డబ్బింగ్ వెర్షన్ మార్చి 8న తెలుగులో కూడా రిలీజ్ కాబోతుంది. ఇప్పటికే సినిమాను ప్రమోట్ చేస్తూ హైదరాబాద్‌లో పలు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చింది మూవీ టీమ్. ఈ సందర్భంగా హీరోయిన్ మమిత తన టాలీవుడ్ ఎంట్రీపై ఫస్ట్ టైమ్ రియాక్ట్ అయింది. "టాలీవుడ్ నుంచి ఆఫర్లు వస్తున్నాయి. అయితే నాకు ముందు తెలుగు బాగా నేర్చుకోవాలని ఉంది. అప్పుడే స్క్రిప్ట్‌ను బాగా అర్థం చేసుకొని మంచి పెర్ఫామెన్స్ ఇచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. తెలుగులో మంచి రోల్స్ చేయాలని నాకు ఉంది." అంటూ మమిత చెప్పుకొచ్చింది. ప్రేమలు సినిమా రిలీజైన దగ్గరి నుంచి ఈ చిత్రం గురించి అలానే మమిత గురించి సోషల్ మీడియాలో తెగ ట్రెండ్ అవుతుంది. ముఖ్యంగా మమితకి అయితే ఫ్యాన్ ఫాలోయింగ్ భారీగా పెరిగింది. ఆమె టాలీవుడ్ ఎంట్రీకి కూడా ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఇక ప్రేమలు తెలుగు వెర్షన్ రిలీజ్ అయ్యాక ఈ బ్యూటీకి డిమాండ్ మరింత పెరిగే అవకాశం ఉంది.



ఇక ఈ హీరోయిన్.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కి పెద్ద ఫ్యాన్. సాధారణంగానే మాలీవుడ్‌లో బన్నీకి సూపర్ క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. కానీ పుష్ప సినిమాతో అది డబుల్ అయింది. కానీ మమిత తాను ఎప్పటి నుంచో అల్లు అర్జున్‌కి పెద్ద ఫ్యాన్ అంటూ పలు ఇంటర్వ్యూల్లో చెప్పింది. ఆయన సినిమాలు మిస్ అవ్వకుండా చూస్తానని ప్రతీ చిన్న డిటైల్ ఇంటర్వ్యూలో చెప్పింది. అలానే ప్రేమలు మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో జరిగిన సమయంలో బన్నీ ఇంటి ముందు నుంచే ట్రావెల్ చేసినట్లు కూడా చెప్పుకొచ్చింది. ఒక్కసారైనా బన్నీ కనిపిస్తారేమోనని ఎదురుచూసినట్లుగా చెప్పింది. ఈ ఇంటర్వ్యూ వీడియోలను బన్నీ ఫ్యాన్స్ ట్రెండ్ చేస్తున్నారు. త్వరలోనే ఈ బ్యూటీకి అల్లు అర్జున్‌తో వర్క్ చేసే ఛాన్స్ దొరకొచ్చు అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఈ రొమాంటిక్ కామెడీ-డ్రామాగా తెరకెక్కిన ప్రేమలు చిత్రంలో శ్యామ్ మోహన్ ఎం, మీనాక్షి రవీంద్రన్, అఖిలా భార్గవన్, అల్తాఫ్ సలీం, మాథ్యూ థామస్, సంగీత్ ప్రతాప్‌లు కీలక పాత్రలు పోషించారు. విష్ణు విజయ్ ఇచ్చిన మ్యూజిక్ కూడా సినిమాకి ప్లస్ అయింది. మరి ఈ చిత్రం తెలుగులో రిలీజ్ అయ్యాక ఎంత సక్సెస్ అవుతుందో చూడాలి మరి.

# స్పీడు పెంచిన రవితేజ..



మాస్ మహారాజా రవితేజ హిట్ ఫ్లాపులతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ వెళ్లిపోతున్నాడు. ఇక వచ్చే నెలలో మరో సినిమాను రవితేజ అనౌన్స్ చేయబోతున్నట్లు టాక్. రవితేజ ప్రస్తుతం అమెరికాలో వెకేషన్ ఎంజాయ్ చేస్తున్నారు. ఆయన కుటుంబంతో కలిసి న్యూయార్క్‌లో తీసుకున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక పది రోజుల తర్వాతే రవితేజ తిరిగి హైదరాబాద్ రానున్నారు. అయితే వచ్చిన వెంటనే మాస్ మహరాజ మరో సినిమాను అనౌన్స్ చేయబోతున్నట్లు సమాచారం. ప్రస్తుతం వెకేషన్ కోసం మిస్టర్ బచ్చన్ షూటింగ్‌కి చిన్న బ్రేక్ తీసుకున్నారు రవితేజ. ప్రస్తుతం ఇద్దరు యంగర్ డైరెక్టర్స్‌తో రవితేజ చర్చలు జరుపుతున్నారు. అందులో ఒకరు 'జాతి రత్నాలు' డైరెక్టర్ అనుదీప్ కావడం విశేషం. ఇప్పటికే అనుదీప్.. రవితేజకు స్క్రిప్ట్ మొత్తం చెప్పి ఒకే చేశారని టాక్. ఇక ప్రొడక్షన్ కంపెనీ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓకే చేసిన వెంటనే సినిమా అనౌన్స్ చేస్తారట. అలానే మరో కొత్త డైరెక్టర్‌తో కూడా రవితేజ సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఏడాదికి కనీసం రెండు లేదా మూడు చిత్రాలను రిలీజ్ చేయాలని రవితేజ ప్లాన్ చేస్తున్నారు. దానికి తగ్గట్లే గతేడాది వాల్తేరు వీరయ్య, రావణాసుర, టైగర్ నాగేశ్వరరావు చిత్రాలను రిలీజ్ చేశారు రవితేజ. ఇందులో మెగాస్టార్ చిరంజీవితో కలిసి చేసిన వాల్తేరు వీరయ్య చిత్రం బ్లాక్ బస్టర్ అయింది. రావణాసుర ఫ్లాప్ కాగా టైగర్ నాగేశ్వరరావు ఫర్వాలేదనిపించింది. ఇక ఈ ఏడాది ఇప్పటికే ఈగల్ సినిమాను రిలీజ్ చేశారు రవతేజ. ఇది బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు రాబట్టింది. ఇప్పుడు మిస్టర్ బచ్చన్ షూటింగ్‌లో ఉన్న రవి.. ఇది పూర్తయిన వెంటనే కొత్త సినిమా సెట్స్‌లోకి అడుగుపెడతారట. ఇలా వరుస సినిమాలతో మాస్ మహారాజా మంచి జోరు మీద ఉన్నారు.

# శ్రీవారి సన్నిధిలో 'ఖుషి' స్టార్

ఆమె సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలతో వైరల్ అవ్వడం మనం చూస్తూనే ఉన్నాం హీరోయిన్ సమంత మరోసారి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమె సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలతో వైరల్ అవ్వడం మనం చూస్తూనే ఉన్నాం. అయితే ఈసారి తిరుమలలో వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి. గత ఏడాది కాలంగా సినిమా లకు దూరంగా ఉంటూ, షూటింగ్స్ కు దూరంగా ఉంటున్న సమంత తిరిగి షూటింగ్స్ కు హాజరు అవ్వబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. మొదట ఆమె ఏ సినిమా షూట్ లో పాల్గొనబోతుంది అనేది క్లారిటీ లేదు. అయితే షూటింగ్ కు ముందు సమంత శ్రీవారిని దర్శించుకున్నట్లుగా సమాచారం అందుతోంది. మళ్ళీ ఇన్నాళ్ళకు స్వామి వారిని దర్శించుకున్న సమయంలో సాంప్రదాయబద్ధమైన వస్త్రాల్లో సమంత కనిపించింది. ఆమె లుక్ కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఆ మధ్య మయోసైటిస్ కారణంగా మొహం లో కల లేకుండా పోయింది. తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్న సమంత ఇప్పుడు పూర్తిగా ఆరోగ్యంగా మారిందని ఈ వీడియో లో చూస్తే అర్థం అవుతోంది. సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామి వారిని సమంత దర్శించుకుంది. సమంతకు తిరుమల అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు ఇచ్చి ఆశీర్వదించారు. సమంత వెళ్లే సమయంలో మరియు వచ్చే సమయంలో కూడా కెమెరా లు ఆమె చుట్టు ముట్టాయి.



బాద్‌షాను టెన్షన్ పెట్టిన అంబానీ ఆమె తదుపరి సినిమాల గురించి ప్రశ్నించేందుకు ప్రయత్నించినా కూడా ఆమె నవ్వుకుంటూ వెళ్లింది. ఆమె మీడియాతో మాట్లాడకుండానే అక్కడ నుంచి వెళ్లి పోయారు. సమంత గత ఏడాది ఖుషి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఆ సినిమా లో విజయ్ దేవరకొండకు జోడీగా నటించిన విషయం తెల్సిందే.

# మన్మథుడు లవ్లీ జోడి..



ఇక నాగార్జున కెరీర్ లో ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమాలలో మన్మధుడు కూడా టాప్ లిస్టులో ఉంటుంది అని చెప్పవచ్చు ఆరు పదుల వయసు దాటినా కూడా ఇంకా యువ మన్మధుడి తరహాలోనే కనిపించే నాగార్జున తనకంటూ ఒక ప్రత్యేకమైన స్టార్ ఇమేజ్ ను క్రియేట్ చేసుకున్నాడు. కమర్షియల్ సినిమాలు మాత్రమే కాకుండా ప్రయోగాత్మకమైన సినిమాలు చేయడంలోనూ ఆయన స్టైలే వేరు అని చాలా సార్లు నిరూపించాడు. ఇక ఆయన నుంచి ఎలాంటి సినిమా వచ్చినా కూడా అందులో ఏదో ఒక డిఫరెంట్ కంటెంట్ ఉంటుంది అని చెప్పవచ్చు. ఇక నాగార్జున కెరీర్ లో ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమాలలో మన్మధుడు కూడా టాప్ లిస్టులో ఉంటుంది అని చెప్పవచ్చు. విజయభాస్కర్ దర్శకత్వం లో వచ్చిన ఈ సినిమాకు త్రివిక్రమ్ స్టోరీ డైలాగ్స్ అందించారు. ఇప్పటికీ సినిమాలోని కామెడీ సీన్స్ సోషల్ మీడియాలో మీమ్స్ రూపంలో వైరల్ అవుతూనే ఉంటాయి. అంతే కాకుండా నాగ్ అభి క్యారెక్టర్ లోని సీన్స్ ఎవరు మర్చిపోలేరు. ఫ్లాష్ బ్యాక్ లో వచ్చే క్యూట్ లవ్ స్టోరీ కూడా సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్. ముఖ్యంగా మహీ క్యారెక్టర్ కూడా చాలా బాగా హైలెట్ అయింది. చూడగానే అందమైన చిరునవ్వుతో ఆకట్టుకున్న ఆ అమ్మాయి అసలు పేరు అషు. ప్రస్తుతం కూడా ఆమె ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఎందుకంటే చాలా రోజుల తర్వాత అషు హైదరాబాద్ లో కనిపించింది. ఒక పార్టీలో ఆమె నాగార్జునను కూడా కలుసుకోవడం విశేషం. అంతే కాకుండా అమలతో కూడా ప్రత్యేకంగా ఫోటోలు దిగారు.